మేయర్‌కు కార్పొరేటర్ వినతి



వినతిపత్రాన్ని అందిస్తున్న కార్పొరేటర్

శేరిలింగంపల్లి: నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ బుధవారం కలిశారు. నల్లగండ్ల కూరగాయల మార్కెట్ అభివృద్ధి, డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి గురించి మేయర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు వీరేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నూతన పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు బుధవారం కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు, సభ్యులను కార్పొరేటర్ సన్మానించారు. కార్యక్రమంలో ఇమ్మాన్యుయేల్, పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు ప్రభుదాస్ , జనరల్ సెక్రటరీ డానియల్ ,ఆర్గనైజింగ్ సెక్రటరీ రత్నపాల్ , కోశాధికారి మోజెస్ ,జాయింట్ కోశాధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

మురుగు సమస్య


వెంకట్రావునగర్‌లో రోడ్డుపై మురుగునీరు

ఆల్విన్‌కాలనీ: మురుగునీరు కిలోమీటర్ల మేర రోడ్లపై పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. కూకట్‌పల్లి, వెంకట్రావ్‌నగర్ కమాన్ వద్ద సుమారు వారం రోజుల నుంచి మురుగునీరు పారుతూనే ఉందని స్థానికులు మండిపడుతున్నారు. రోజుల తరబడి దుర్వాసనను భరించలేకపోతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. అసలే వర్షాలు పడుతుండడంతో వర్షపు నీటిలో మురుగునీరు కలిసిపోయి ప్రవహించటంతో నడవాలంటే అసౌకర్యంగా ఉంటున్నదని పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వరద సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో గ్రీన్ ఫీల్డ్స్ పరిసర ప్రాంతాల్లోని నందన్ హోమ్స్‌లో మంగళవారం రాత్రి వరదనీరు ఇళ్లలోకి చేరింది. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు హైడ్రా బృందం క్షేత్రస్థాయికి చేరుకొని పరిస్థితిని చక్క దిద్దారు. నందన్ కాలనీ చుట్టూ ప్రణీత్ గేటెడ్ కమ్యూనిటీ వారు పెద్ద ప్రహరీ గోడ నిర్మించడంతో ప్రతి వర్షాకాలంలోనూ ఈ సమస్య నెలకొంటోంది. బీరంగూడ నుంచి వరద నీరు నందన్ హోమ్స్‌లో చేరింది. ఇళ్లలోకి నీరు వస్తుందని భయాందోళనతో కాలనీవాసులు మంగళవారం రాత్రి మీడియాకు, అధికారులకు ఫోన్లు చేసి తమ సమస్యను వివరించారు. అర్ధరాత్రి సమయంలో హైడ్రా సిబ్బంది కాలనీకి చేరుకుని సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. అయితే శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కాలనీలో సమస్య ఉంటే సమాచారం ఇవ్వండి

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టుకుమార్

పటాన్‌చెరు టౌన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని శాంతినగర్, వెంకటేశ్వర కాలనీ, లక్కదొడ్డి కాలనీలలో పర్యటించారు.మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని, అదేవిధంగా డ్రైనేజీ సమస్యను పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది, మాన్సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, జీహెచ్ఎంసీ మేనేజర్ అరుణ్, శానిటేషన్ సూపర్‌వైజర్ పవన్ ,హెచ్ఎండబ్ల్యూఎస్, మాన్సూన్ సిబ్బంది ఉన్నారు.









6 సంవత్సరాలైనా అందుబాటులోకి రాలేదు..

మల్టీ జనరేషన్ పార్కు ప్రారంభోత్సవానికి గ్రహణం

99 శాతం పనులు పూర్తి.. త్వరగా ప్రారంభించాలని స్థానికుల విజ్ఞప్తి

మియాపూర్: డివిజన్ పరిధిలోని మయూరినగర్‌లో మొట్టమొదటగా చేపట్టిన మల్టీ జనరేషన్ పార్కు పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో గ్రీనరీ, ఆటవస్తువులు పాడైపోయే అవకాశముంది. ఉరుకుల పరుగుల జీవనంలో ప్రజలు కాసింత సేదతీరేది పార్కుల్లోనే. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు కొత్త పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన క్రమంలో మయూరిరినగర్ కాలనీలో 6 సంవత్సరాల క్రితం పార్కు అభివృద్ధి పనులు చేపట్టారు. దాదాపుగా పూర్తయినా ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు.

వివరాలు ఇలా...

గత ప్రభుత్వ హయాంలో 2019 మార్చి 27న మల్టీ జనరేషన్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు 8 ఎకరాల విస్తీర్ణంలో పార్కును అభివృద్ధి చేశారు. రూ.2కోట్ల వ్యయంతో పనులను చేపట్టారు. వాకింగ్ ట్రాక్, రాక్ గార్డెన్, ఓపెన్ జిమ్‌లు , పిల్లల ఆటవస్తువులు, గ్రీనరీ, కుర్చీలు, మెమరీ గార్డెన్, పరగోళాను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పార్కు చుట్టు ప్రహరీ నిర్మించి గోడలకు పల్లె వాతావరణం ప్రతిబింబించేలా రంగురంగుల చిత్రాలు వేయించారు. ఇక ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి కొన్ని పనులు జరుగుతున్నాయి. గత ఏడాది నిధులు చాలకపోవడంతో కొన్నాళ్లు పనులు ఆగిపోయాయి. ఎమ్మెల్యే గాంధీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మరో రూ.2కోట్లు కేటాయింపజేశారు. 4 నెలల కిందట నగర మేయర్ విజయలక్ష్మీ పార్కులను సందర్శించిన క్రమంలో ఈ పార్కులో పనులను పరిశీలించారు. ఆ సమయంలో స్థానికులు పార్కును త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేయగా త్వరగా పనులు పూర్తిచేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. మేయర్ ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు.



అందుబాటులోకి తీసుకువస్తాం...

మయూరినగర్ పార్కు నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేస్తాము. పార్కులో చిన్న చిన్న పనులు, గ్రీనరీ పరిరక్షణకు ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

– డీఈ దుర్గాప్రసాద్ ,చందానగర్ సర్కిల్



పట్టుదల, క్రమశిక్షణతో విజయం తథ్యం

కేవీఎస్ ఆర్‌ఓ హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణవేణి



విద్యార్థులకు సర్టిఫికెట్‌ను అందిస్తున్న కృష్ణవేణి, ఈడీ డాక్టర్ లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: ప్రగతిశీల భారతదేశం కోసం మేధో సంపత్తిని పెంపొందించుకోవడానికి పట్టుదల, క్రమశిక్షణతో విద్యార్థులు చదువుకోవాలని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ జి కృష్ణవేణి పేర్కొన్నారు. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్–హైదరాబాద్ ప్రాంగణంలో 12వ తరగతిలో ప్రతిభ చాటిన వారికి 'ప్రతిభ సమ్మాన్.. సమారోహ' పేరిట ఎఫ్‌డీడీఐ ,హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ లోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె విద్యార్థులను సన్మానించారు. సమాజం కోసం విద్యార్థులు, యువత తమవంతూ కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను కూడా అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపల్ జితేంద్రకుమార్, ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ, అధికారులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరదనీరు నిలవకుండా చర్యలు

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించిన ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులు



శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులు బుధవారం పరిశీలించారు. ట్రాఫిక్ మేడ్చల్ జోన్ అడిషినల్ డీసీపీ వీరన్న, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆనంద్‌లు పర్యవేక్షించారు. ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వరద నీరు నిలవకుండా సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు

- రూ.200 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెల్లడి

గచ్చిబౌలి: పేద, మధ్య తరగతి విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి అవకాశం లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ 200 కోట్ల నిధులతో ఆధునిక సదుపాయాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం విద్యారంగ అభివృద్ధిలో ఇది ఓ మైలురాయి అని అన్నారు.



పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇప్పటికే మూడు గురుకుల పాఠశాలలుండగా తాజాగా మరో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు కానుంది. అమీన్‌పూర్ పట్టణంలో సర్వే నెంబర్ 993లో 25 ఎకరాల విస్తీర్ణంలో తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నారు. పాఠశాల ఏర్పాటుకు 200 కోట్లు నిధులు మంజూరయ్యాయి.

◆ రాష్ట్రంలో మొత్తం 100 రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

మరుగుదొడ్లు లేక ఇబ్బందులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లిలో జహీరాబాద్, బీదర్ బస్సులు ఆగే బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించారు. కానీ గత ఏడాది క్రితం మరుగుదొడ్లను తొలగించారు. దీంతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఈ బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. మహిళలను దృష్టిలో పెట్టుకొని బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు నిర్మించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట


బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ గేట్ నెంబర్ 2, వివేకానందనగర్ కాలనీ, కమల ప్రసన్ననగర్, మాధవరంనగర్ కాలనీ, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుంచి మాధవరం కాలనీ అప్రోచ్ రోడ్డు, రిక్షాపుల్లర్స్ కాలనీలో 1 కోటి 37 లక్షల 55 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌లు రాగం నాగేందర్ యాదవ్, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. అదే విధంగా వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద 1కోటి 90 లక్షల రూపాయల అంచనా వ్యయంతో వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుంచి మాధవరం నగర్ కాలనీ హైటెన్షన్ లైన్ కింద నాలా మీద కల్వర్టు నిర్మాణం పనులు పూర్తయిన సందర్భంగా బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు పరిశీలన

రాయదుర్గం: ప్రజావసరాలకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు.

గచ్చిబౌలి డివిజన్ సోఫా కాలనీలో నూతనంగా చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాలనీవాసులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించడంతో బాటు అధికారులు ఎప్పటికప్పుడు పనులను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు రాజునాయక్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సుమన్, వేణు, గోపాల్‌రెడ్డి, కృష్ణ, కలియ నాయక్, శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సోఫా కాలనీవాసులు, స్థానికులు పాల్గొన్నారు.


సోఫాకాలనీలో పర్యటించిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

ఉద్యోగ విరమణ సత్కారం


డిప్యూటీ స్టేషన్ మాస్టర్ పున్నారావును సన్మానించిన ఉద్యోగులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ టి.పున్నారావు పదవీ విరమణ కార్యక్రమంను నిర్వహించారు. శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో స్టేషన్ మాస్టర్ రాజు ఆధ్వర్యంలో పున్నారావును రైల్వే ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 37 ఏళ్ళ సర్వీస్‌ను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ మాస్టర్ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ స్టేషన్ మాస్టర్లు రాజీవ్‌కుమార్, సత్యవాస్, పాయింట్స్ మెన్స్ శ్రీనివాస్, క్రాంతి కుమార్, రాకేష్‌కుమార్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపుతామని కార్పొరేటర్ పుష్ప తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలలోని డ్రైనేజీ పైప్‌లైన్‌లు నిండి మురుగు పారుతోందని ,సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు.



నాటు కోడిగుడ్లకు భలే డిమాండ్

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పౌల్ట్రీ సెంటర్ వద్ద విక్రయించే నాటు కోడి గుడ్లకు భలే డిమాండ్ ఉంది. ఇక్కడ రోజూ పౌల్ట్రీ అధికారులు నాటు కోడి గుడ్లను విక్రయిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విక్రయాలు జరుగుతాయి. నాటు కోడిగుడ్ల కోసం వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడకు వస్తుంటారు. డిమాండ్ నేపథ్యంలో రోజూ ఉదయం ఉదయం 8 గంటల నుంచే క్యూలో నిల్చుంటారు. బ్రాయిలర్ కోడి గుడ్ల కంటే నాటు కోడి గుడ్లు ఆరోగ్యానికి మంచివని దీంతో పాటు బయట మార్కెట్ల కంటే ఇక్కడ ధర కూడా తక్కువ ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రజలు లైన్‌లో నిలబడి మరీ నాటు కోడి గుడ్లను కొనుగోలు చేస్తుంటారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్‌లో మ్యాన్‌హోల్ ధ్వంసం అయింది. టర్నింగ్‌లో ఉండటంతో వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదం చోటు చేసుకుంటుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసం అయిన మ్యాన్‌హోల్‌ను గుర్తించేందుకు గాను స్థానికులు కర్రలు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



మణికొండ: మంచిరేవులలోని వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామ శివారు ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ఉన్న దేవాలయం గోల్కొండ నవాబుల కాలంలో వారి వద్ద మంత్రులుగా పనిచేసిన అక్కన్న, మాదన్నలు నిర్మించారు. దేవాలయ నిర్మాణంతో పాటు దాని నిర్వహణ నిమిత్తం వందలాది ఎకరాల భూమిని కేటాయించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం 8 గంటలకు స్వస్తివాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, రక్షాబంధనం నిర్వహించారు. 11 గంటలకు హారతి, ప్రసాద గోష్టి, సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం ధ్వజారోహణం, బలిహరణం, సాయంత్రం భేరి పూజ, దేవతాహ్వానము, హనుమంతవాహన సేవ, హారతి ఉంటుందని అర్చకులు వివరించారు.

రుద్రారం పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- రూ.16 కోట్లు సీఎస్ఆర్ నిధులతో నూతన భవనం


ఎమ్మెల్యేకు ప్లాన్ గురించి వివరిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ రాష్ట్రంలోనే రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను 16 కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులతో ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. రుద్రారం ఉన్నత పాఠశాలను స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఎంవైకే లాటిక్రేట్ సంస్థ ప్రతినిధులతో కలిసి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్లాన్, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రముఖ ఆర్కిటెక్చర్ సంస్థ కృతిక ద్వారా ఆధునిక వసతులతో నిర్మించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను 3 ఎకరాల 34 గుంటల స్థలంలో 43,378 చదరపు అడుగుల విస్తీర్ణంతో 15 తరగతి గదులు, మండల పరిషత్ పాఠశాలను ఒక ఎకరా 23 గుంటల స్థలంలో 26,586 చదరపు అడుగుల విస్తీర్ణంలో 10 తరగతి గదులు నిర్మించబోతున్నట్లు తెలిపారు. వీటితోపాటు ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ కోర్టులను నిర్మించబోతున్నట్లు తెలిపారు .కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు, మాజీ ఎంపీటీసీలు రాజు, హరి ప్రసాద్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ నాయక్, సంస్థ ప్రతినిధి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

తెల్లాపూర్‌లో.. 60 లక్షల రూపాయలతో అదనపు తరగతి గదులు...

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 60 లక్షల రూపాయల నిధులతో నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం ముత్తంగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని అమెరికాకు చెందిన మెడ్విన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు 60 లక్షల రూపాయలతో తరగతి గదులు నిర్మించేందుకు ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మండల విద్యాశాఖ అధికారి, సంస్థ ప్రతినిధి నరసింహారావు పాల్గొన్నారు.